
# మంగమ్మగారు మార్నింగ్ వాక్

"రేపట్నించి నేనొక మంచి పని మొదలు పెట్టబోతున్నాను" అన్నారు ఆ రోజు రాత్రి పడుకోబోయేముందు మంగమ్మగారు వాళ్ళాయనతో.

మంగపతిగారు ఉలిక్కిపడ్డారు. భార్యామణి కొత్త ఆలోచన ఏమిటో అని ఆయన గుండె దడదడ లాడింది.



"అదేమిటో తొందరగా చెప్పవే బాబూ! టెన్షన్ పెట్టకు" అన్నారాయన లేచి కూర్చుంటూ.

"భయపడకండి! ఇందులో మిమ్మల్ని ఇరికించను. మావాళ్ళు అంటే వనజ వావిలాల, చంప చిన్నరుగుల మొదలైన వాళ్ళంతా మార్నింగ్ వాక్ మొదలు పెట్టారుట. వాకింగ్‌కి వెళ్ళొస్తే ఆ రోజంతా ఒళ్ళు తేలికగా హాయిగా వుంటోందిట. అందుకని నేను మార్నింగ్ వాక్ మొదలు పెడదామనుకుంటున్నా" అన్నదావిడ నడుము వాలుస్తూ. అమెరికా పద్ధతిలో వాళ్ళ ఇంటి పేర్లు చివర చెప్పడం మర్చిపోలేదామె.

తేలికగా ఊపిరి తీసుకున్నారు మంగపతిగారు. "ఉగాది రోజున ఏ పని మొదలు పెట్టినా జయంగా సాగుతుందని అంటారుగా... అందుకే వ్యయనామ సంవత్సరం ఉగాది రోజున అంటే రేపటి నుంచి పొద్దున్నే లేచి అలా నడిచి వస్తాను" అన్నదావిడ నిద్రలోకి జారుకుంటూ.

అన్నట్టుగానే ఉదయం అయిదున్నరకే లేచి కూర్చుందావిడ. తల కాస్త పైపైన దువ్వకుని, నలిగిన చీరెని సరిగ్గ కట్టుకుని చెప్పులు తొడుక్కుని బయల్దేరింది.

అంత సులభంగా బయటకు కదలడం ఆవిడ ప్రాణానికి హాయిగా వుంది. 'అదే పిట్స్ బర్గ్‌లో అయితే సాక్సూ, షూస్, కోటు, గ్లవ్స్ అంటూ బయటకు అడుగు పెట్టాలంటే ఆస్ట్రోనాట్‌లా తయారవ్వడం విసుగొచ్చేది' అనుకుందావిడ. అమెరికాలో ఆర్నెల్లు గడిపి ఈ మధ్యనే తిరిగివచ్చారు వాళ్ళు. అయితే ఆవిడ ఊహించనిదేమంటే ఇక్కడ మరొకరకం భేషజం ఆడవాళ్ళలో చోటుచేసుకుందని. యాభై అయిదేళ్ళ వయసులో భార్య వాకింగ్ మొదలు పెడతానని బయల్దేరడం మంగపతి గారికి మాత్రం సంతోషంగానే అనిపించింది.

కాసేపట్లో ఆయాసపడుతూ ఇంటికి వచ్చారు మంగమ్మగారు.

రాగానే మరో కుర్చీలాక్కుని అందులో కూలబడి విసురుగా అన్నారు "ఛ ఛ... పరువుపోయింది. నిద్రలేచి ఆ మొహంతో అలా వెళ్ళిపోయానా – అక్కడ దారిలో కలిసిన వావిలాల, చంప చిన్నరుగుల, కనకదుర్గ కందుకూరి గార్లను చూసి సిగ్గుతో చితికిపోయానంటే నమ్మండి" అని.

"ఏమయిందేమిటి?" పేపర్లోంచి తలెత్తకుండానే అడిగాడాయన.

"ఏమీ పట్టనట్టు ఎంత సాదాగా అడుగుతున్నారో చూడు. భార్య అవమానం మీది కాదా? నేనేమో ఇలా నలిగిపోయిన చీరెతో, జిడ్డు ముఖంతో వెళ్ళానా? వాళ్ళందరూ చక్కగా మడత నలగని కాటన్ చీరలు కట్టుకుని,

ముఖానికి పౌడరు కూడా పట్టించి పువ్వుల్లా వచ్చారు" అన్నదావిడ కళ్ళనీళ్ళ పర్యంతమవుతూ.

"సరేగానీ... ఏడు గంటలు కావొస్తోంది... కాసిని కాఫీ నీళ్ళు పడేస్తావా నా ముఖాన..." ట్రెడిషనల్‌గా అడిగాడు తనే మళ్ళీ.

"అయ్యోరామా... మీకు ఏదయినా చిన్న పిల్లలకు చెప్పినట్టు చెప్తే తప్ప స్వంతంగా ఏమీ తోచదు కదా... కాస్త కాఫీ డికాషను వేసి, పాలు కాచి వుంచితే నేను రాగానే కాఫీ కలిపి ఇస్తాను కదా... ఇప్పుడు పాలు కాగి, డికాషన్ దిగేసరికి ఇంకో పావు గంటేనా పడుతుంది. గుర్తుంచుకోండి... రేపటి నుంచి పొద్దున్న పూట కాఫీ డికాషన్ వేసి, పాలు కాచి పెట్టడం మీ డ్యూటీ..." అంటూ చెప్పేసి లోపలికి వెళ్ళిపోయిందావిడ.

'హతోస్మి' అనుకుంటూ మళ్ళీ పేపరు చదవసాగారు మంగపతిగారు.

***

ఆ రోజు సాయంత్రం ఆరుగంటలు కావొస్తూండగా తను చకచకా తయారైపోయి, భర్తను తొందరచేసిందావిడ. "తొందరగా రెడీ అవ్వండీ... బజారు కెళ్ళి నాలుగు కాటన్ చీరలు కొనుక్కొద్దాం. నేను ఇంట్లో కట్టే నేత చీరెలు మరీ మెత్తబడిపోయాయి..." అని.

"బయటకు కట్టుకునే చీరెలు చాలానే వున్నాయి కదుటే..." హతాశుడై అడిగాడాయన.

"ఉన్నాయి. కానీ అన్నీ సింథటిక్ శారీస్. సమ్మర్‌లో మార్నింగ్ వాక్‌కి వెళ్తూ అవి కట్టుకెళ్తే నవ్విపోతారు" అన్నది మంగమ్మగారు ఇంతమాత్రం తెలియదేం ఈ మగాళ్ళకి అన్న టోన్‌లో.

ఇక చేసేదేమీ లేక బజారుకు బయల్దేరారు మంగపతిగారు. అనుకున్న చీరెలు, జాకెట్టు బట్టలూ కొనుక్కుని వచ్చారు.

మర్నాడు ఉదయం మంగమ్మగారు ఆరు గంటలవుతున్నా లేవకపోవడంతో తనే మేలుకొలుపు పాడేరు మంగపతిగారు "నీ మార్నింగ్ వాక్‌కి ఆలస్యమైపోతుందేమో" అంటూ.

"అబ్బ... ఆ చీరెలకు మేచింగ్ జాకెట్లు కుట్టించేదాకా ఎలా వెళ్తానండీ..." అంటూ పక్కకు తిరిగి పడుకున్నదావిడ.

"అది కాదోయ్... ద్వితీయ విఘ్నం పనికిరాదు కదా... మరి రెండో రోజునే మానేస్తే ఎలా?" అడిగాడాయన.

"ఉగాదినాడు మొదలుపెట్టాను కదండీ... ఇక విఘ్నం అంటూ వుండదు..." అన్నదావిడ నమ్మకంగా.

కొత్త చీరలకు ఫాల్స్, అంచులు, మాచింగ్ జాకెట్లు అన్నీ అమరడానికి వారం పట్టింది. ఆ రోజున మళ్ళీ ఉదయం తొందరగా లేచి, మరీ కొత్త చీరెలా కనబడకూడదని క్రితం రోజు సాయంత్రం ఒకసారి కట్టి విడిచి మడతపెట్టిన కాటన్ చీర కట్టుకుని మార్నింగ్ వాక్‌కి వెళ్ళిందావిడ.

ఆవిడ వచ్చే లోపుగా నీళ్ళు మరగబెట్టి, ఫిల్టర్‌లో కాఫీపొడి వేసి, డికాషన్ వేసి, పాలు కాచి వుంచాడాయన. వచ్చీరాగానే ఆలస్యం లేకుండా కాఫీ కలిపి ఇస్తుందని ఇల్లాలి కోసం ఎదురుచూస్తూ పేపరు పట్టుకుని వీధి గుమ్మం ముందు కుర్చీలో కూర్చున్నారు మంగపతిగారు.

ఆవిడ లోపలికి వస్తూండగానే "నువ్వు చెప్పినట్టే పాలు కాచేసి, డికాషన్ రెడీ చేసానోయ్" అన్నాడాయన ఆవిడ మెప్పుకోలుకు ఎదురు చూస్తూ.

కానీ ఆయన ఆశించినట్టు "దటీజ్ ఎ గుడ్ బోయ్" అని ఇంగ్లీషులో అలవాటుగా అనలేదావిడ.

పైగా రుసరుసలాడుతూ "ఏమిటో దేనికయినా పుణ్యం చేసుకోవాలి. ఓ కిలోమీటరు దూరం దాకా నడిచేటప్పుడు వాకింగ్‌షూస్ వేసుకు వెళ్ళాలే... చెప్పులు కాదు అని సలహా చెప్పి, మొన్న చీరెల కోసం వెళ్ళినప్పుడు ఆ షూస్ కూడా కొనిపెట్టి వుండచ్చుగా... వాళ్ళందరి మీదా వాళ్ళ మొగుళ్ళు శ్రద్ధ తీసుకుని ముందుగానే అన్నీ అమరుస్తారు... మీ కసలు నా గురించి ఆలోచించే తీరికెక్కడిదీ? వాళ్ళందరూ షూస్ వేసుకుని మెత్తగా చప్పుడు కాకుండా నడుస్తూంటే నేనేమో కిర్రు కిర్రుమని చప్పుడు చేస్తూ చెప్పులతో నడుస్తూంటే ఎంత అవమానంగా అనిపించిందో మీకేం తెలుస్తుందీ?" అన్నదావిడ బాధపడిపోతూ.

మంగపతిగారు నాలుక కరుచుకున్నారు "నిజమే సుమీ... నాకు తోచలేదా విషయం! ఇప్పుడేమయింది లేవోయ్... సాయంకాలం వెళ్ళి వాకింగ్ షూస్ కొనుక్కువద్దాం. సరేనా? మరిక కాఫీ కలుపుతావా?" అన్నారు.

చిన్న పిల్లాడిలా తప్పు ఒప్పుకుని బేలగా మాట్లాడిన మొగుడి కేసి మురిపెంగా చూసి "ఏమో అనుకుంటాను గానీ నేనంటే మీకిష్టమే..." అని నవ్వి లోపలికి వెళ్ళిందావిడ.

అనుకున్నట్టుగానే ఆ రోజు సాయంత్రం బజారుకు వెళ్ళి నాలుగు షాపులు తిరిగారు. కేన్వాసు షూ చూపిస్తే 'ఇవి కాదు వాళ్ళు వేసుకునేవి' అందావిడ. ఆఖరికి స్నీకర్స్ కొనిచ్చారాయన. షాపులో సేల్స్‌మాన్ ఆవిడ

కాళ్ళకు ఆ బూట్లు తొడిగి, లేస్ బిగించి, "నడిచి చూడండి మేడమ్... చాలా సౌకర్యంగా వుంటాయి" అంటూ చెప్పాడు.

అతడు లేసులు ఎలా ఎక్కించాడో, ముడి ఎలా వేశాడో శ్రద్ధగా చూసి మనసులోనే గుర్తుపెట్టుకుందావిడ. మళ్ళీ పొద్దున్నే ఆయనగార్ని నిద్రలేపి 'షూ లేస్' బిగించమంటే ఎగతాళి చేస్తారన్న భయం ఆవిడకు.

"షూస్ కొనుక్కున్నాక వాకింగ్ చాలా హాయిగా వుందండీ" అంటూ రెండు రోజులు మురిసిపోయింది మంగమ్మగారు.

నాలుగు రోజులు వరుసగా "ఉదయపు నడక" నిర్విఘ్నంగా సాగింది. అయిదో రోజు పొద్దెక్కినా లేవలేదు మంగమ్మగారు.

"ఆ షూస్ కొనుక్కున్నందుకన్నా వాకింగ్ మానకే..." అంటూ నిద్రలేపారు మంగపతిగారు.

"అబ్బా! మీ బాధ ఆ షూస్ గురించే గానీ నామీద ప్రేమతో కాదు లేపడం" అంటూ నిష్ఠూరం వేసి,

"అయినా వారానికి నాలుగు రోజులు నడక చాలునటండీ... మీరేం దిగులు పడకండి... రెండ్రోజులయ్యాక మళ్ళీ వాకింగ్‌కి వెడతాను..." అంటూ పడుకుని నిద్రపోయిందావిడ. మరో వారం గడిచింది.

ఒక రోజున తిరిగి రాగానే "మీరు నాకో సెల్‌ఫోన్ అర్జెంటుగా కొనాలండి!" అన్నది మంగమ్మగారు.

"వాకింగ్ కెళ్ళడానికి సెల్‌ఫోనెందుకే?" అంటూ నిజంగా ఆశ్చర్యపోయారు మంగపతిగారు. నడిచేటప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడితే ఫైన్ వేస్తామని పోలీసులు ఒక చట్టం చేయలేదెందుకో అని కూడా మనసులో అనుకున్నారు.

"వనజ వావిలాల, చంప చిన్నరుగుల, కనకదుర్గ కందుకూరి అందరూ సెల్‌ఫోన్లు తెచ్చుకుంటున్నారు. మధ్యలో వాళ్ళాయనలు ఫోన్ చేస్తే స్టయిల్‌గా మాట్లాడుతూ నడుస్తారు. 'మీరు 'సెల్' తెచ్చుకోలేదేం?' అని అడిగారు నన్ను... తలకొట్టేసినట్టయింది" చిన్నబోయిన ముఖంతో అన్నదావిడ.

ఆవిడనలా చూస్తుంటే మంగపతిగారికి ప్రేమ పొంగుకు వచ్చింది. 'ఓస్... అంతేకదా... కొందాంలే... మహాభాగ్యంకాదుగా..." అన్నారాయన. అంతకుముందు 'సెల్' ససేమిరా వద్దన్నదీ ఆయనే.

మంగమ్మగారి ముఖం వికసించింది. మర్నాడు వాకింగ్‌కి వెళ్ళే ముందు మొగుడిని హెచ్చరించిందావిడ "మర్చిపోకుండా ఫోన్ చెయ్యండి" అని. అలాగేనంటూ బుద్ధిగా తల ఊపాడు ఆయన.

అనుకున్నట్టుగానే ఆయన కాల్ చెయ్యడంతో తనూ స్టయిల్‌గా మాట్లాడుతూ నడిచిందావిడ. మాట్లాడ్డం అయ్యాక మామూలుగా అన్నట్టుగా అంది "మా రెండో అమ్మాయేమో అనుకున్నా... కాలిఫోర్నియాలో వుంది గదా... మేం వుండేది 'ఫ్రీమాంట్'లో తను ఉద్యోగం చేసేది 'శాన్‌ఫ్రాన్సిస్కో'లో. ఆఫీసు నుంచి సాయంత్రం బయల్దేరగానే 'బార్ట్ నుంచి ఫోన్ చేసేది... ఇప్పుడు వాళ్ళకు సరిగ్గా సాయంత్రం కదా..." అని.

ఆవిడ అమెరికా అనుభవాలు వినడం వాళ్ళకు అలవాటే గనుక అది 'గర్వం' అనుకోరు. 'బార్ట్' అంటే ఏమిటండీ? అనడిగింది కనకదుర్గ కందుకూరి.

"బే ఏరియా రాపిడ్ ట్రాన్స్‌పోర్ట్" బార్ట్ అంటారు. అంటే ట్రెయిన్ అన్నమాట... మొన్న రెండ్రోజులు ఫ్రీగా తిప్పారట అందర్నీ" అందావిడ. 'బార్ట్' తనే నడుపుతున్నట్టు.

జూన్ వచ్చి జల్లులు పడగానే మంగమ్మగారి మార్నింగ్ వాక్‌కి బ్రేక్ పడింది.

"అదేమిటే... బొత్తిగా మానేశావు?" అనడిగారు మంగపతిగారు.

"ఆ రోడ్లు ఎంత అధ్వాన్నంగా వుంటాయో తెల్సుగా... నా బూట్లు కాస్తా పాడైపోతాయి. వానలు తగ్గాక వెళ్తాన్లెండి" అందావిడ.

"ఉగాదినాడు మొదలుపెట్టినా కుంటుపడిందే?" అంటూ నవ్వారాయన.

"మీ ఎగతాళి చాలు లెండి... మార్నింగ్ కాకపోతే ఈవెనింగ్ వాక్ వెడతాను..." అంటూ మూతి తిప్పిందావిడ.

● కథాకేళి మాస పత్రిక - 1-5-2007 ●